క్లుప్తంగా

నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తమ్మడపల్లి గ్రామస్తులు

మర్రిగూడ : మండలంలోని తమ్మడపల్లి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదేళ్లుగా గ్రామం వివక్షతకు గురైందని, అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ఆయనను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో డ్రెయినేజీ, సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ ఇడగోని కృష్ణయ్య, గుమ్మకొండ రఘునందన్‌రెడ్డి, మేకల నరసింహారెడ్డి, ఇడగోని వెంకటేష్, కొట్టం శ్రీనివాస్, నజీర్, జంగయ్య తదితరులు ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు చండూరు గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పి.స్వామి శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. 2024–25లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉమ్మడి ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ప్రవేశపరీక్ష ఫిబ్రవరి 23న ఉదయం 11గంటలకు గురుకుల విద్యా సంస్థల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నకిరేకల్ : తెలంగాణలో సాంఘీక సంక్షేమ శాఖ గురుకులాల్లో 5వతరగతి 2025–26 విద్యాసంవత్సరానికి సీట్ల భర్తీ కోసం, 6నుంచి 9వతరగతిలో బ్యాక్‌లాక్ సీట్ల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి శనివారం తెలిపారు.

కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా సుకన్య



నకిరేకల్ : పట్టణంలోని 4వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ గాజుల సుకన్య కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ జాతీయ మహిళా అధ్యక్షురాలు అల్కలాంబా, రాష్ట్ర అధ్యక్షురాలు మొగలి సునీతరావు ఉత్తర్వులు జారీచేశారు. శనివారం సుకన్య ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



సన్మానిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

మునుగోడు : తొలి మహిళాఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గేరే నర్సింహ, సుధాకర్, నర్సింహ, స్వామి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నకిరేకల్ : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల కోరారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండలం, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, ెంకటేశ్వర్లు, కృష్ణ, నర్సింహ, నాగమణి, గింజల లక్ష్మి, స్వరూప, శశికళ పాల్గొన్నారు.

చెరువును నింపాలని వినతి

చిట్యాల : మండలంలోని పేరేపల్లిలో గల ఈదులోని చెరువును పిల్లాయిపల్లి కాల్వనీటితో నింపాలని ఆ గ్రామస్తులు, రైతులు శనివారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. పేరేపల్లి చెరువులోకి కాల్వ నీరు సులువుగా వచ్చేందుకుగాను రైతులంతా కలిసి జేసీబీలతో శనివారం కాల్వ తవ్వకం పనులు చేపట్టారు. ఇప్పటికే వెలిమినేడు, పేరేపల్లి గ్రామాల మధ్య కాల్వ నీరు వెళ్లేందుకుగా పైపులను ఏర్పాటు చేశారు.

ప్రమాదకరం.. ఆటో ప్రయాణం

- పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు
- మైనర్లే డ్రైవర్లుగా మారుతున్న వైనం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపేదీ

నాంపల్లి : గ్రామీణ ప్రాంతాలలో ఆటో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఆటోవాలాలు నిబంధనలను తుంగలోకి తొక్కి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నారు. కొంతమంది ఆటోల్లో వెనుక వైపున నిల్చొని కూడా ప్రయాణిస్తున్నారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకొని వెళ్తుండడంతో పలు సందర్భాల్లో అదుపు తప్పి బోల్తా పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగేటప్పుడు కొద్ది రోజుల వరకు అధికారులు హడావుడి చేసి అనంతరం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మండలంలో విద్యార్థులు, కూలీలు పాఠశాలలకు, ఇతర ప్రాంతాలకు ఆటోలలో పరిమితికిమించి వెళ్తున్నారు. దీంతో గతంలో పలు ప్రమాదాలు జరిగినా ఆటో యాజమాన్యల తీరు మారడం లేదు. మండలం నుంచి ప్రతిరోజు ఉదయం ఒక్కొక్క ఆటోలో విద్యార్థులు 15మంది నుంచి 20మంది వరకు పాఠశాలలకు, కళాశాలలకు ప్రయాణిస్తున్నారు.



ప్రమాదకరంగా ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

అవగాహన కల్పించినా మారని తీరు..

ఆటో యూనియన్లకు, ప్రజలకు పలుమార్లు ప్రమాదాలపై అవగాహన కల్పించినా వారి తీరు మారడం లేదు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆటోలలో కూలీలను, విద్యార్థులను పరిమితి లేకుండా ఎక్కించుకుని తమ ఇష్టానుసారంగా సినిమా పాటలతో వెనుక నుంచి వాహనాలను గమనించకుండా అతివేగంగా వెళ్తున్నారు. దీంతో రోజూ ఎక్కడో ఒక చోట జరుగుతున్న ఘటనలతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



గట్లమల్లేపల్లి వద్ద బోల్తా పడిన ఆటో (ఫైల్)

మైనర్లే డ్రైవర్లుగా..

మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులను, కూలీలను, ప్రయాణికులను తరలించేందుకు మైనర్లే ఆటో డ్రైవర్లుగా మారి ప్రమాదాలకు కారణం అవుతున్నారు. గ్రామాలలో ఆటోల సంఖ్య పెరగడానికి ఆర్టీసీ బస్సుల కొరతే కారణం. ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా అందుకు అవసరమైన మేరకు బస్సులను నడపడం లేదు. దీంతో ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా పోలీ సులు స్పందించి మైనర్లు డ్రైవింగ్ చేయకుండా, పరిమితికి మించి ప్రయాణికులను తరలించకుండా కఠిన చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని మండల ప్రజలు వాపోతున్నారు.

పరిమితికి మించి తీసుకెళ్తున్నారు



ఆటోలలో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోవడంతో అవి అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. అదే విధంగా అధిక వేగంతో వెళ్తుండడంతో మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అతివేగంగా, సినిమా పాటలు పెట్టుకొని వెనుక నుంచి వచ్చే వాహనాల వారు సౌండ్ చేసిన వినిపించకుండా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.

– మారేపాకుల రాములు, తిరుమలగిరి

నిబంధనలు పాటించని వారిపై చర్యలు



మండలంలోని ప్రతి ఆటోవాలా నిబంధనలు పాటించి ప్రయాణికులను తరలించాలి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవు. ముఖ్యంగా మైనర్లు ఆటోలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు కలిగిఉండాలి. తమ సిబ్బందితో నిత్యం తనిఖీలు చేస్తున్నాం. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి.

– శోభన్‌బాబు, ఎస్‌ఐ, నాంపల్లి

రాజకీయాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : రాజకీయాలకతీతంగా పేదలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతున్నానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 195మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందన్నారు. నీటి పారుదల విషయంలో గత పాలకులు ఉమ్మడి నల్లగొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. కేటీఆర్ పైకేసు పెడితే రాద్ధాంతం చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, నకిరేకల్, చిట్యాల మున్సిపల్ చైర్మన్లు చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరావు, కాంగ్రెస్ మహిళా రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య శ్రీనివాస్, నాయకులు నకిరేకంటి ఏసుపాదం, లింగాల వెంకన్న, సుంకర బోయిన నర్సింహ, దూదిమెట్ల సత్తయ్య, దండి నాగేశ్వరరావు, గాదగోని కొండయ్య, పెద్ది సుక్కయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నకిరేకల్ : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

పట్టణంలో విద్యుత్ ఉద్యోగుల (ఐఎన్‌టీయూసీ–327) యూనియన్ క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఎస్‌పీడీసీఎల్ అదనపు కార్యదర్శి ఎండీ అబ్బాస్, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్, డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమ్మిరెడ్డి, సబ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాస్, వెంకన్న, సెక్షన్ లీడర్లు రాములు, రవికుమార్, సంజీవ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

చిట్యాల : మహిళలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణనాయక్, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకటరెడ్డి, మెప్మా టీఎంసీ సరిత, మున్సిపల్ కౌన్సిలర్‌లు జమాండ్ల జయమ్మశ్రీనివాస్‌రెడ్డి, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, పాటి మాధవరెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీమా భరోసా



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ : కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ బీమా అందించి భరోసానిస్తుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త వల్లపు కొండల్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతడికి పార్టీ సభ్యత్వం ఉండడంతో మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును శనివారం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, జిల్లా నాయకులు రామిడి వెంకటరమణారెడ్డి, చెరుకు లింగంగౌడ్, ఊరిపక్క నగేష్, అయిలి లక్ష్మీనరసింహ, మాజీ సర్పంచ్‌లు కుంభం మాధవరెడ్డి, వల్లపు పర్వతాలు, సైదులు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

నల్లగొండ టూటౌన్ : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు బట్టలు, చెప్పులు, కొబ్బరినూనె పంపిణీ చేశారు. అనంతరంఆయన మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన 9నెలల ఏరియర్స్ బకాయిలు వెంటనే ఇస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మున్సిపల్ వాహనాలను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. మున్సిపాలిటీకి 11నూతన వాహనాలను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గడ్డం శ్రీనివాస్, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పాఠశాలల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

నల్లగొండ టౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం పట్టణంలోని విపస్య పాఠశాలలో ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నా రు. విజేతలకు గెజిటెడ్ ఎడ్యుకేషనల్ అధికారి దేవపాల, ప్రిన్సిపాల్ గోపాల శ్రీనివాసరావులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ విజయభాయి అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.



నల్లగొండ టౌన్ : విపస్య స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ..

నకిరేకల్ : పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 60మంది పద్మశాలి మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొట్టబత్తుల పార్థసారధి, రాపోలు రవి, సంఘం నాయకులు మూడుదుడ్ల కృష్ణమూర్తి, రాములు, పద్మ, శ్రీనివాస్, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

పట్టణంలోని మాస్టర్‌మైండ్ పాఠశాలలో శనివారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రాస్మా మండల అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి, ప్రిన్సిపల్ పునీతారెడ్డి, ఏట కృష్ణ బహుమతులు అందజేశారు.

ఓక్‌ట్రీ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని ఓక్‌ట్రీ పాఠశాలలో సంక్రాంతి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగోలీ, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ గడ్డం మంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు చేనేతకు చేయూత, నేతన్నకు భద్రత, చేనేత భరోసా పథకాలు మంజూరు చేసినందుకుగాను పట్టణంలో నర్సింగ్‌భట్ల చేనేత సహకార సంఘం కార్మికులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నర్సింగ్‌భట్ల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు జిల్లా నరసింహ, కమిటీ సభ్యులు వల్ల కీర్తికుమార్, చెరుపల్లి భాగ్యమ్మ, బొల్లా మారమ్మ, గణేష్, రాము, రమేష్, శ్రీను పాల్గొన్నారు.



మునుగోడులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు



నకిరేకల్ : పాలాభిషేకం చేస్తున్న చేనేత సంఘం నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నేతన్నల అభివృద్ధి

మునుగోడు: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే చేనేత కార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని విస్మరించిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత పొదుపు, భద్రత, భరోసా పథకాలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మునుగోడు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎంతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పున్న కైలాస్ నేత పాల్గొని మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరంలోనే రూ.874 కోట్లు విడుదల చేసిందన్నారు. రూ.50 కోట్లతో నూతనంగా సిరిసిల్లలో నూలు డిపోను ఏర్పాటు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు అవ్వారి భాస్కర్, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు గంజి భిక్షం, సంగిశెట్టి పరమేష, కోణం జగన్నాథం, గంజి నరేందర్, రావిరాల కుమారస్వామి, మిర్యాల మారయ్య, బొల్ల యాదగిరి పాల్గొన్నారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే పాలాభిషేకం

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పేరుతోచేనేతకు నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాలను ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ పట్టణంలో చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చిలుకూరి లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో శనివారం సీఎం, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు గోలి పద్మ, గంజి యల్లయ్య, రాపోలు గురువయ్య, చిలుకూరి రామలింగం, బాల్నే వెంకటనర్సయ్య, చిలుకూరి సుధాకర్, పెండెం రాములు, మూడుదుడ్ల అంజమ్మ, పున్న కేశవులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చండూరు : చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని తిరిగి ప్రారంభించడం హర్షణీయమని చేనేత సహకార సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాటి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చేనేత భరోసా కింద కార్మికులకు సంవత్సరానికి రూ.24వేలు ఇవ్వనున్నట్లు, అదే విధంగా జీవిత బీమా కింద వయసుతో ప్రమేయం లేకుండా జియోట్యాగ్ కలిగిన కార్మికుడు మృతి చెందితే రూ.5లక్షలు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రాపోలు లక్ష్మయ్య, కోశాధికారి రావిరాల ఓంకారం, డైరెక్టర్ చిట్టిపోలు వెంకటేశం, మేనేజర్ తిరందాసు భిక్షమయ్య, కార్మిక సంఘం అధ్యక్షుడు రాపోలు వెంకటేశం, చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు చెరుపల్లి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, జూలూరు వెంకటేశం, బొల్ల జనార్దన్, శ్రీను, మల్లేశం పాల్గొన్నారు.



నల్లగొండ టౌన్ : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నాంపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు చేనేత బీమా, త్రిఫ్ట ఫండ్‌ను ఏర్పాటు చేయడం చేనేత కార్మికులకు ఒక వరంలా ఉందని కాంగ్రెస్ మండల నాయకుడు సంగెపు గణేష్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు సంగెపు సతీష్, పిల్లలమర్రి రంగయ్య, గుర్రం భిక్షమయ్య, గుర్రం శ్రీరాములు, గుర్రం భరతయ్య, గుర్రం గణేష్, గుర్రం వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, మల్లేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్ : రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన మండల శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లు, నగదు రహిత వైద్యం, పీఆర్సీ అమలు, ఇతర సమస్యలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం 45మంది పెన్షనర్ల జన్మదినం సందర్భంగా వారితో కేక్‌కట్ చేయించి సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జిల్లా శ్రీశైలం, మోహన్‌రావు, రంగయ్య, సుధాకర్, శేషారెడ్డి, పుల్లయ్య, కేశవాచారి, ఆంజనేయులు, రామలింగం, ముత్యాల కృష్ణయ్య, కేశవాచారి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

బస్సు ఢీకొని ఒకరు మృతి

చిట్యాల : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వెలిమినేడు గ్రామపరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కమల్ సాయి బాత్ర(35) మండలంలోని వెలిమినేడు గ్రామపరిధిలోని ఇటుకల బట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వెలిమినేడు గ్రామంలోని జాతీయ రహదారిపై దాడుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపుకు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కమల్‌సాయి బాత్ర అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు గుర్తించి ఎన్‌హెచ్ హైవే అంబులెన్స్‌లో మృతదేహాన్ని నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. కాగా శనివారం వరకు మృతుడి తరుపున ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

వైభవంగా 'కూడారై'

రామగిరి(నల్లగొండ) : ధనుర్మాసోత్సవాలలో భాగంగా పట్టణంలోని ఆయా ఆలయాలలో శనివారం కూడారై ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రామగిరి సీతారామచంద్రస్వామి ఆలయం, వీటీకాలనీ శ్రీదేవిభూదేవిసహిత వేంకటేశ్వరస్వామి, సిద్ధారకాలనీలోని శ్రీభవానీసమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇత్తడి, వెండి గంగాళాలలో పాయసాన్ని గోదా రంగనాథస్వామికి నివేదించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఈట జయరామయ్య, రామరంగాచార్యులు, షఠగోపాలచార్యులు, యాదగిరాచార్యులు, రఘునందనభట్టార్, రంగనాథచార్యులు, జగన్నాథచార్యులు తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



కూడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు నైవేద్యం అందజేస్తున్న ప్రవచకుడు



రామగిరిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు..



రామాలయంలో నృత్యం చేస్తున్న యువతి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిగూడ : ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని తిరగండ్లపల్లి గ్రామశివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగా రెడ్డి జిల్లా యాచారం మండలం మల్కీజ్‌గూడకు చెందిన గండికోట సత్యం శుక్రవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై మర్రిగూడ నుంచి తన గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో మాల్ నుంచి మర్రిగూడకు వస్తున్న ఓ బొలేరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యం రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం